క్లుప్తంగా

కాలువ పనులకు భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ

నక్కపల్లి: మేజర్ పంచాయతీ నక్కపల్లిలోని రాజీవ్ నగర్ కాలనీలో వీధి కాలువల నిర్మాణానికి పంచాయతీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ పనులకు సంబంధించి కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ బుధవారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధిలోను ముందుగా సైడు కాలువలను నిర్మిస్తామన్నారు.

క్రీడల నిర్వహణకు స్థల పరిశీలన



క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో క్రీడల నిర్వహణకు అవసరమైన స్థలాన్ని బుధవారం ఎంపీడీవో ఎం.ఉషారాణి పరిశీలించారు. క్రీడలకు సంబంధించి ప్రభుత్వం స్థలాలను కేటాయించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కబడ్డీ, వాలీబాల్‌తో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. క్రీడలకు అనువైన స్థలం ఎంపిక చేయడం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన శివస్వాముల అంబలం పూజ



అంబలం పూజ చేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన శివ స్వాముల అంబలం పూజ అంబరాన్నంటింది. శివమాలలు ధరించిన భక్తులు అంబలం పూజలో పాల్గొని శివ నామస్మరణ చేశారు. గురుస్వామి మాడెం జోగారావు నేతృత్వంలో పీఠం స్వాముల సహకారంతో ఈ అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపించిన గీతాలు అందరినీ భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అంబలం పూజలో భాగంగా ఏర్పాటు చేసిన శివలింగం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హాకీ పోటీల్లో సాయిరామ్ సత్తా




సాయిరామ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అడ్డురోడ్డు శ్రీప్రజ్ఞా కళాశాల విద్యార్థి కొలనాటి సాయిరామ్ సత్తా చాటాడు. అండర్-19 విభాగంలో హాకీ చాంపియన్‌షిప్‌గా నిలిచిన సాయిరామ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాము తెలిపారు. వచ్చే నెలలో జార్ఖండ్‌లో జరిగే నేషనల్ హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రా తరఫున ఆడనున్నాడన్నారు. ఈ మేరకు సాయిరామ్‌ను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కోటవురట్ల: ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని యండపల్లి, అన్నవరం గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యండపల్లిలో ఈ నెల 22 వరకు, అన్నవరంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆధార్‌లో చేర్పులు, మార్పులు, అప్‌డేట్ వంటి సేవలు ఈ శిబిరాల్లో అందుతాయన్నారు.

సామాన్యుడిపై ధరల దరువు..!



- ఆకాశాన్నంటిన నిత్యావసర, కూరగాయల ధరలు
- బజార్‌కు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్న జనం
- ధరల నియంత్రణపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం

కోటవురట్ల: ధరల శరాఘాతంతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. కూటమి ప్రభుత్వం ఏదేదో చేసేస్తుందని ఊహించుకున్న పేద, మధ్య తరగతి ప్రజలకు నిరాశే ఎదురైంది. వారి నడ్డి విరిగేలా ధరలు మండిపోతున్నాయి. పప్పు దినుసులు పంతం పట్టి కిందకి దిగిరానంటుండగా, వంట నూనె ధరలు సలసల కాగిపోతున్నాయి. ఇక కూరగాయలు కూడా ఒకదానికొకటి పోటీ పడుతూ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉల్లి కంటతడి పెట్టిస్తుండగా వెల్లుల్లి మంట పెట్టిస్తోంది. సూపర్ సిక్స్ పథకాల మాటేమో గానీ పెరిగిన ధరల నియంత్రణకు కనీసం చర్యలు తీసుకోవడం లేదంటూ జనం మండిపడుతున్నారు. కూరగాయల కోసం బజారుకు రూ.500 పట్టుకొని వెళ్తే కనీసం సంచి నిండడం లేదు. ఇక నిత్యావసర సరకుల ధరల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మరో వైపు కార్తీక మాసం ప్రభావం కూరగాయల ధరలపై పడడంతో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. కూటమి పాలనలో సామాన్యుడి పరిస్థితి ఏం కొనేట్టు లేదు.. ఏం తినేట్టు లేదు అన్నట్టుగా అయిపోయింది.

కూరగాయలు (కిలోల్లో..)	ధర (రూ.లలో..)
ఉల్లి	70
మిర్చి	80
అల్లం	140
క్యాబేజీ	40
కాలీఫ్లవర్	60
బీన్స్(పిక్కలు)	80
బెండకాయలు	80
చిక్కుడు	90
టమాటా	40
క్యారెట్	80
బీట్‌రూట్	80
బంగాళాదుంపలు	50

నిత్యావసరాలు (కిలోల్లో..)	ధర (రూ.లలో..)
కంది పప్పు	180
మినప పప్పు	130
పెసర పప్పు	120
ఆయిల్(రిఫైన్డ్)	150
పచ్చి శనగపప్పు	105
వేపిన పప్పు	110
కరాచీ నూక	45
బియ్యం	60
ఆవాలు	100
జీలకర్ర	400
వెల్లుల్లి	440

నిత్యావసర ధరలు దిగిరావడం లేదు..



నిత్యావసర సరకుల ధరలు పైకి ఎగబాకి కిందికి దిగిరావడం లేదు. కంది పప్పు కొనాలంటే హడలెత్తిపోతున్నాం. గత ప్రభుత్వంలో కంది పప్పు కిలో రూ.120 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ.180 అయ్యింది. కూరగాయలు, నిత్యావసర ధరలను అదుపుచేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సామాన్యుడి నడ్డి విరిగేలా కూటమి పాలన ఉంది. ముమ్ముందు ఇంకెలా ఉంటుందో..!

– తమరాన రామసత్యనారాయణ, కె.వెంకటాపురం

పెరిగిన ధరలతో సతమతమవుతున్నాం..



కూరగాయల ధరలు చాలా దారుణంగా పెరిగిపోయాయి. పెరిగిన ధరలు ఏకంగా రెండు నెలలైనా అదుపులోకి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ధరల అదుపు చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో సామాన్యుడు బతకలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ధరలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– గొల్లు రాంబాబు, కె.వెంకటాపురం

ప్రజలకు చుక్కలు చూపించేలా చంద్రబాబు పాలన

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట ఇన్‌చార్జి కంబాల జోగులు



సమావేశంలో మాట్లాడుతున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం: ప్రజలకు చుక్కలు చూపించేలా చంద్రబాబు పరిపాలన ఉందని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు దుయ్యబట్టారు. ఎస్.రాయవరంలో బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. పేద ప్రజలను మరింత ఇబ్బందులు పెట్టేలా కూటమి పాలన ఉండబోతోందన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెంచి తిండికి ఇబ్బందులు తెచ్చిపెట్టారన్నారు. పేదలు చదువుకు దూరమయ్యేలా అమ్మఒడి పథకం నిధులు విడుదల చేయలేదన్నారు. ఇప్పుడు తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వ రోడ్లపై టోల్ ప్లాజా పెడతానని ప్రకటన చేసి ప్రజలపై మరింత భారం మోపేందుకు శ్రీకారం చుడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలల్లోనే ఇంతటి ఘోరంగా పరిపాలన ఉంటే.. ముమ్ముందు ఇంకెంతో దారుణంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెంతుతున్నారని జోగులు దుయ్యబట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పి హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. జరిగిన దారుణాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నిస్తుంటే.. గత ప్రభుత్వంలో కూడా జరిగాయని సమర్థించుకోవడం చంద్రబాబు చేతకాని తనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. అప్పట్లో మహిళలకు ఏ చిన్న కష్టం వచ్చినా గ్రామాల్లో మహిళా పోలీసులు, అందుబాటులో ఉన్న దిశ పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పందించేవారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, కొరుప్రోలు పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం నానాజీ, గుర్రాజుపేట మాజీ సర్పంచ్ మధువర్మ, పార్టీ నాయకులు కుర్రా కాశి, పాలుమూరి అప్పలరాజు పాల్గొన్నారు.

రైతుల అనుమతి లేకుండా సర్వే ఎలా చేస్తారు?

- భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రభుత్వం
- సీపీఎం నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న అప్పలరాజు తదితరులు

నక్కపల్లి: రైతుల అనుమతి లేకుండా వారి జిరాయితీ భూములను ఎలా సర్వే చేస్తారని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. బుధవారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, తదితరులు పెదతీనార్ల, చినతీనార్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తమ భూములను సర్వే చేస్తున్నారని, సర్వే చేసే సమయంలో తమ అనుమతి తీసుకోలేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైతులకు చెందిన జిరాయితీ భూముల్లో అనుమతి లేకుండా ప్రవేశించి సర్వే చేసే అధికారం అధికారులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం రైతులకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా భూముల్లోకి కలెక్టర్ సైతం వెళ్లకూడదన్నారు. భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి సర్వేలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే నక్కపల్లి మండలంలో 5,500 ఎకరాలను సేకరించి ఏపీఐఐసీ వద్ద ఉంచుకున్నారన్నారు. రైతుల దగ్గర కారుచౌకగా భూములు సేకరించి కార్పొరేట్ కంపెనీలకు కోట్లాది రూపాయలకు విక్రయిస్తూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో చేస్తున్న సర్వేను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, ఎం.రాజేష్, లోవరాజు, నాగమణి, కాశీసోమోరు పాల్గొన్నారు.

8 ఎకరాల భూమికి అక్రమ రిజిస్ట్రేషన్

- దస్తావేజుల హామీతో అప్పు తీసుకున్న స్నేహితునికే టోకరా
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

నక్కపల్లి: తన వద్ద అప్పు తీసుకున్న పాపానికి స్నేహితునికే టోకరా ఇచ్చి.. హామీగా పెట్టిన దస్తావేజులతో రూ.5 కోట్ల విలువైన భూమిని వేరొక వ్యక్తులకు విక్రయించిన ఘటన పాయకరావుపేట మండలం కుమారపురంలో చోటు చేసుకుంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు, సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాయకరావుపేట మండలం కుమారపురానికి చెందిన మద్ది నాగ రవికుమార్ తన స్నేహితుడైన కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన దేవవరపు వెంగబాబు వద్ద తనకు మూడు చోట్ల ఉన్న 8.12 ఎకరాల జిరాయితీ భూములకు చెందిన ఒరిజినల్ దస్తావేజులను హామీగా పెట్టి రూ.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత బాకీ తీర్చేశాడు. అయినా వెంగబాబు దస్తావేజులు ఇవ్వడానికి కాలయాపన చేయడంతో అనుమానం వచ్చిన రవికుమార్ నక్కపల్లి సబ్‌రిజిస్టార్ కార్యాలయానికి వెళ్లి ఈసీలు తీయించడంతో అసలు విషయం బయటపడింది. అప్పు ఇచ్చిన వెంగబాబు అతని స్నేహితులు కందికొండ శ్రీనివాస్, ఎం.వెంకటకృష్ణల సహాయంతో.. రవికుమార్ భూమిని వివిధ వ్యక్తులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసేశాడు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో మహంతరపు వెంకటకృష్ణ అనే వ్యక్తి రవికుమార్ సంతకం ఫోర్జరీ చేసి అతని మాదిరిగానే నటించాడు. కందికొండ శ్రీనివాస్ రిప్రజెంటేటివ్‌గా వ్యవహరించాడు. ఈ వ్యవహారంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబులు సమగ్రంగా విచారణ జరిపారు. తమ విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ఈ ఘటనకు సంబంధించి వెంకటకృష్ణ, కందికొండ శ్రీనివాస్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కుమారస్వామి తెలిపారు. ఈ బాగోతంలో ప్రమేయం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, తప్పుడు సాక్షులుగా సంతకాలు పెట్టిన వారందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఇప్పటికీ గ్రంథాలయాలకు చక్కని ఆదరణ

- ముగిసిన వారోత్సవాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



యలమంచిలి గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులు



దిమిలి శాఖా గ్రంథాలయంలో బహుమతులు ప్రదానం చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు



పాయకరావుపేటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథులు



చినదొడ్డిగల్లులో బహుమతులతో విద్యార్థులు



కోటవురట్లలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో జ్ఞాపికలతో విద్యార్థులు



మునగపాక మండలంలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది

నక్కపల్లి: శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇప్పటికీ గ్రంథాలయాలకు ఆదరణ తగ్గకపోవడం గొప్ప విషయమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. మండలంలో నక్కపల్లి, చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. చినదొడ్డిగల్లులో జరిగిన ముగింపు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సామాజిక కార్యకర్త బండారు గోవిందు, తెలుగు అధ్యాపకుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు గ్రంథాలయాధికారి జనార్దన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కవిత, స్థానిక నాయకులు వెలగా సుధాకర్, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ తోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. నక్కపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్థానిక హెచ్‌ఎం రాణిలలిత, గ్రంథాలయాధికారి గోవిందేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు.

కోటవురట్ల: స్థానిక గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఎంఈవో రామారావు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, దాసు, బి.ఎస్.ప్రసాద్, కిషోర్, వెంకటరత్నం, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు గ్రంథాలయ సహాయ అధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీఐ జి.అప్పన్నబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, కంభంపాటి రమణ, పెదిరెడ్డి చిట్టిబాబు, ఆర్.రత్నం, అచ్యుత రామయ్య, యోగా గురువులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని గణపర్తి, మునగపాక శాఖా గ్రంథాలయాల్లో వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మునగపాకలో నిర్వహించిన వేడుకలకు ఎంఈవో బుద్ద శివనాయుడు అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. గణపర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో భాగంగా విజేతలకు హైస్కూల్ హెచ్‌ఎం జయలక్ష్మి బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో దిమిలి శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ముగ్గుల పోటీల విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శకుంతల, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

యలమంచిలి: గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ అన్నారు. యలమంచిలి శాఖా గ్రంథాలయంలో ముగింపు వేడుకల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన పోటీల విజేతలకు ఆయన బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కొక్కిరాపల్లి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, సీఏ బంగారు శెట్టి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ ఆడారి పూరీ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధనకు విశేష స్పందన



వన సమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మహిళలు

కోటవురట్ల: మండల కేంద్రం శివారున మోదకొండమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన వన సమారాధన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రైతులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, అయ్యప్పస్వాములు మోదకొండమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామైక్యతను చాటుతాయన్నారు. భక్తి భావం రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేస్తుందన్నారు. ఆలయ కమిటీ పెద్దలు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

25న రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

మునగపాక: పాటిపల్లి రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 25న ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23న కల్యాణ రాట వేస్తామన్నారు. 25న ఉదయం 9 గంటల నుంచి శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో అమ్మవారికి సారె ఊరేగింపు చేపడతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించాలని కోరారు.

నాగులాపల్లిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



దళితవాడలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక: మండలంలోని నాగులాపల్లి దళితవాడలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాలనీవాసులకు బీపీ, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ ఆశా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మ, జిల్లా దళిత బహుజన యువజన సేవా సంఘం అధ్యక్షుడు డొక్కా శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పరాలుకు ఘన నివాళి



పరాలు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: పాటిపల్లి మాజీ సర్పంచ్ కొయ్య పరాలు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. ఇటీవల పరాలు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. పరాలు పాటిపల్లి పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొయ్య శేషు, చక్రం, కోరుకొండ రాజు, అచ్చియ్యనాయుడు, శ్రీను పాల్గొన్నారు.

తూర్పు కాపు సంఘం కార్యవర్గం ఏర్పాటు



తూర్పు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ తూర్పు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం జరిగాయి. స్థానిక పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తూర్పు కాపు సంఘం అధ్యక్షుడిగా బొద్దపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నగిరెడ్డి గణేశ్, ఉపాధ్యక్షులుగా నక్కా శివ శంకర్, కొఠారు సూర్యప్రకాశరావు, సంయుక్త కార్యదర్శులుగా కోడిగుడ్డు రమణ, నానేపల్లి నరేశ్, కోశాధికారిగా ఊటా సతీశ్, కార్యవర్గ సభ్యునిగా అత్తిలి నూకరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం పెద్దలు బోదెపు గోవింద్, నగిరెడ్డి శ్రీను, కరణం శ్రీహరి, అడపా శేషగిరిరావు పాల్గొన్నారు.

వైభవ వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం



స్వామి కల్యాణ మహోత్సవాలకు పుట్టమన్ను తెస్తున్న బొలిశెట్టి దంపతులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదా దంపతులు పుట్టమన్ను తెచ్చి నవ ధాన్యాలు నాటి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో సన్నాయి మేళాల మధ్య పుట్ట మన్ను తెచ్చేందుకు బొలిశెట్టి దంపతులతో పాటు పేరంటాళ్లు, పలువురు మాలధారణ భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు, పుణ్యాహవచనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు.